క్లుప్తంగా

ఇందువాసిలో నాటక ప్రదర్శన



గట్టు: మండలంలోని ఇందువాసి గ్రామంలో బుధవారం రాత్రి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఇంజమ్మవ్వ దేవర సందర్భంగా ఉచిత నాటక ప్రదర్శన నిర్వహించారు. నాటక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ అధ్యక్షుడు జంబు రామన్‌గౌడ్ ప్రారంభించారు. నాటకాన్ని తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గురువారం తెల్లవారుజామున వరకు నాటక ప్రదర్శన కొనసాగింది.

తాగునీటి బోరు ప్రారంభం



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని భక్తుల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును గురువారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై, స్విచ్ ఆన్ చేశారు. ఆలయంలో ఎమ్మెల్యే సహకారంతో చెట్లు, పూల మొక్కలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. భక్తులకు సౌకర్యానికి తాగునీటి బోరు వేయడానికి సహకరించిన వారికి ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, నాయకులు ఉరుకుంద, వెంకన్‌గౌడ్, చంద్రశేఖర్, ఆంజనేయులు, గోపి, జింధప్ప, తదితరులు ఉన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య



అలంపూర్: రైతులకు కేంద్ర ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య అందిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జునరెడ్డి అన్నారు. అలంపూర్ మండలంలోని క్యాతూర్ రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ యోజన, రాష్ట్రీయ కిసాన్ వికాస్ వంటి వాటికి విశిష్ట సంఖ్య తప్పనిసరి అని పేర్కొన్నారు. 20వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధుల విడుదలకు 11 అంకెల విశిష్ట సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుకు జత చేసిన మొబైల్ నంబరు వంటి వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారికి అందించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



మానవపాడు: మండలంలోని ఎ.బూర్దిపాడులో స్వాముల వారి గోవిందమాంబ రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సూక్తహోమం, స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం



ధరూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ నాణ్యమైన యూనిఫాం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంఈఓ రవీంద్రబాబు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని నర్సన్‌దొడ్డిలో టైలర్లను కలిసి విద్యార్థులకు సంబంధించిన దుస్తులను పరిశీలించారు. అనంతరం రేవులపల్లి ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపును సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్యాంపులో నేర్పిస్తున్న పలు అంశాలపై వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు.

చెరువులకు రక్షణ ఏది?

- ఆక్రమణకు గురవుతున్న శిఖం భూములు
- 17 ఏళ్లుగా నీటి సంఘాల జాడేలేదు
- ఏటా తగ్గుతున్న నీటి నిల్వలు



కోతకు గురై ఎండిపోయిన ఇటిక్యాల లింగమ్మ చెరువు



కంపచెట్లతో దర్శనమిస్తున్న కొండేరు లచ్చమ్మ చెరువు

ఎర్రవల్లి: చెరువుల్లో నీటి నిల్వలు పెంచి వాటిని అభివృద్ధి చేయడం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'మిషన్ కాకతీయ' పనులకు శ్రీకారం చుట్టింది. కానీ చెరువులు, కుంటల అభివృద్ధి, వాటి నిర్వహణ, ఆయకట్టు స్థిరీకరణ, పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించడం మాత్రం మర్చిపోయింది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గతంలో ప్రభుత్వం చెరువులను, కుంటలను కొద్ది వరకు శుభ్రం చేసి పునరుద్ధరించింది. కానీ నీటి సంఘాలు, పాలకవర్గాలు లేకపోవడంతో చెరువు భూములు ఆక్రమణకు గురైనా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇప్పటికే నియోజకవర్గంలోని చాలా చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తే ఆయకట్టు రైతులు చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువులు, కుంటల నిర్వహణతో పాటు ఆయకట్టు నీటి విడుదలను పర్యవేక్షించేవారు.

2008 నుంచి ఎన్నికల జాడేలేదు...

అలంపూర్ నియోజకవర్గంలో వంద ఎకరాల ఆయకట్టు, అంతకంటే తక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు, కుంటలు మొత్తం 114 వరకు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2006లో రాష్ట్ర వ్యాప్తంగా వంద ఎకరాలు ఆయకట్టు ఉన్న చెరువులకు, సాగునీటి సంఘాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎన్నికలు నిర్వహించారు. పాలకవర్గం రెండేళ్లు మాత్రమే ఉండటంతో 2008 లోనే వారి పదవీ కాలం ముగిసింది. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారినా సాగునీటి సంఘాలకు తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. చెరువులపై పర్యవేక్షణ లేకపోవడంతో మత్స్యశాఖ అధికారులు కూడా నామ మాత్రంగా చేప పిల్లలను వదిలి చేతులు దులుపుకుంటున్నారు. దీనివల్ల పలు చెరువులు, కుంటలు వర్షాకాలంలో కోతకు గురై నీరు పూర్తిగా బయటికి వెళ్తుంది. కొన్నిసార్లు మత్స్యకారులు చేపలు పట్టుకోవడం కోసం నీటిని వదిలేస్తున్నా అడిగే వారు లేరు. దీనివల్ల ఆయకట్టు రైతులు పంటలు ఎండిపోయి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి వాటిని మరింత అభివృద్ధి చేయాలని అన్నదాతలు, మత్స్యకారులు కోరుతున్నారు.

మండలాల వారీగా చెరువు,కుంటలు

మండలం	జీపీలు	చెరువులు, కుంటలు
ఇటిక్యాల	29	44
మానవపాడు	16	06
ఉండవెల్లి	16	03
అలంపూర్	14	18
రాజోళి	11	04
వడ్డేపల్లి	10	05
అయిజ	28	44

నీటి సంఘాలతోనే..



నీటి సంఘాలను ఎన్నుకోవడం ద్వారా చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో ఆ సంఘాలు ఉండటం వల్ల నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వారి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ప్రవేశపెట్టిన పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు చెరువుల్లోని పూడికతీత పనులు సక్రమంగా చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను అభివృద్ధి చేయాలి.

– బాబురెడ్డి, రైతు, సాసనూలు

చెరువులను ఆక్రమిస్తే చర్యలు



చెరువు పరిధిలో ఉన్న ఆయకట్టు రైతులు చెరువులను ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్పకుండా నోటిఫికేషన్ జారీ చేసి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తాం. గతంలో చెరువుల అభివృద్ధి పనులు నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు చూసుకునేవారు.

– నరేష్, తహసీల్దార్, ఎర్రవల్లి

బ్యాంక్‌లో అదనపు కౌంటర్ ఏర్పాటు చేయాలి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అలంపూర్: పట్టణంలోని ఎస్‌బీఐలో ఖాతాదారుల సౌకర్యార్థం అదనంగా మరొక కౌంటర్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు గురువారం బ్యాంక్ మేనేజర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకులో గతంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి లావాదేవిలు కొనసాగించారన్నారు. ప్రస్తుతం ఒక కౌంటర్ మాత్రమే ఉండటంతో బ్యాంకు సేవలు పొందడానికి వచ్చిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంక్ సేవలు పొందడానికి కౌంటర్ వద్ద గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వస్తోందన్నారు. దివ్యాంగులు, వృద్ధులు క్యూలైన్లలో నిరీక్షించి సొమ్మసిల్లిపడిపోతున్న ఘటనలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, నాయకులు నరసింహ, శ్రీనివాసులు, మౌలాలి తదితరులు ఉన్నారు.

కల్వర్టును ఢీకొట్టిన ఆటో: ఇద్దరికి గాయాలు



అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న ఆటో

ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని కొండేరుకు చెందిన బోయ రాముడు తన ఆటోలో అదే గ్రామానికి చెందిన ముష్టి బీచుపల్లితో పాటు మరో ముగ్గురు ప్రయాణికులతో కలిసి గద్వాల నుంచి ఎర్రవల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో గద్వాల–ఎర్రవల్లి రహదారిపై నంది గోశాల సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బోయరాముడు, ముష్టి బీచుపల్లికి తీవ్ర రక్త గాయాలు కాగా.. మరో ముగ్గురు ప్రయాణికులు తేలికపాటి గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

చదువుతో పాటు వ్యాయామం అవసరమే



విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవడంతో పాటు క్రీడలు, వ్యాయామంపై శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి సూచించారు. గురువారం ఇటీవల వెలువడిన పది, ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టరేట్ సమావేశ మందిరంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా నుంచి అమ్మాయిలు ఉత్తీర్ణత శాతం, అధిక మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ముగ్గురు గిరిజన అమ్మాయిలు జేఈఈ మెయిన్స్‌కు ఎంపిక వ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇది ఆరంభం మాత్ర మే అని భవిష్యత్‌లో చదువుతో పాటు వ్యాయామం, క్రీడల్లో పాల్గొంటూ విజ్ఞానంతో పాటు ఆరోగ్యాన్ని సమపార్జించుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెమెంటోతో పాటు వారికి ఉపయోగపడే ఏపీజే అబ్దుల్ కలాం రాసిన ఇగ్నేటిడ్ మైండ్స్ పుస్తకం బహుకరించారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్‌ఘనీ, డీఐఈఓ అంజయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో వనపర్తి పదో తరగతి ఉత్తీర్ణత శాతంలో 29వ స్థానానికి పడిపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 9వ తరగతిలో గణితంలో వెనుకబడి ఉన్న విద్యార్థుల జాబితా సేకరించి జూన్ 12 నుంచి నెల రోజులపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కావడానికి వీలు లేదని, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని విద్యార్థులకు తగిన రీతిలో బోధించాలన్నారు. విద్యార్థులు ఫెయిల్ అయితే సంబంధిత సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

మానవపాడు: గ్రామాల్లో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ భాస్కర్ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలను జాగ్రత్తగా పెంచాలని వనసంరక్షకులకు సూచించారు.

పని ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించాలి



ధరూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని ధరూరు గ్రామస్తులు కోరుతున్నారు. ధరూరు ప్రధాన చెరువు కింద ఉన్న పొలాల్లో పని చేసేందుకు వెళ్తున్న కూలీలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని, ఆటోలు లేదా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగించాలని వారు కోరుతున్నారు. గ్రామం నుంచి పని ప్రదేశం వరకు దాదాపు 3 కి.మీ ఉంటుందని, ఎంతల తీవ్రత కారణంగా వచ్చి పోవడానికే ఇబ్బంది కలుగుతోందని వాపోయారు. అలాగే పని ప్రాంతంలో చలువ పందిళ్లు, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు, ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



అయిజ: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారిలో అనర్హులను జాబితా నుంచి తొలగించేందుకు చేపట్టిన సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. గురువారం మండలంలోని నౌరోజ్ క్యాంపు, వేణిసోంపురం గ్రామాల్లో ఎంపీడీఓ వెంకటయ్య పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులను గుర్తించారు. అదేవిధంగా మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఉన్న వారి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకొని అనర్హులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు.

వివాహిత అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామానికి చెందిన వడ్డె హైమావతి (29) అనే వివాహిత గురువారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం సాయంత్రం భర్త వడ్డె చంద్రుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆమె గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లడంతో పోలీసులు పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రస్తుతం మళ్లీ కనబడకపోవడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఆరగిద్దలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

గట్టు: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు. గురువారం గట్టు మండలం ఆరగిద్ద గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ నిళ్ల నిర్మాణాలను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులను ఈమేరకు ప్రోత్సహించాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి పనులు జరుగుతున్న చోట అదనపు కలెక్టర్ కూలీలతో మాట్లాడారు. ఉపాధి పనులను పరిశీలించారు. చెక్‌డ్యాంను, నాణ్యత ప్రమాణాలు, పనుల పురోగతిని సమీక్షించారు. పనులు వేగవంతంగా నిబంధనల మేరకు పూర్తి చేసే విధంగా ఉపాధి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఉపాధి పనుల పర్యవేక్షణ, రైతులకు అందాల్సిన సేవలపై స్పష్టమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ స్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన



మహిళలకు చేతి వృత్తులపై అవగాహన కల్పిస్తున్న రాజ్‌కుమార్ ఫౌండేషన్ నిర్వాహకులు

గట్టు: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించి, కుటుంబానికి ఆసరాగా ఉండాలని రాజ్‌కుమార్ ఫౌండేషన్ నిర్వాహకురాలు రత్నకుమారి తెలిపారు. గురువారం చాగదొన గ్రామ పంచాయతీలో రాజ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు, బాలికలకు, విద్యార్థినులకు చేతి వృత్తులు, బాల్య వివాహాల నిర్మూలన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి పొందడానికి చేతివృత్తులైన టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ ఇతర పనుల వలన ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. గ్రామాల్లో ఎట్టి పరిస్థితుల్లో బాల్య వివాహాలు జరుగకూడదని, బాల్య వివాహాలు జరుగుతున్నా, వాటిని అడ్డుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సోషల్ మొబిలైజర్ మధు, రాజ్‌కుమార్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రవీణ్, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



అయిజలో మాట్లాడుతున్న సీఐ టాటాబాబు

అయిజ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని శాంతినగర్ సీఐ టాటాబాబు హెచ్చరించారు. గురువారం అయిజ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసరావుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపడం ద్వారానే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్ల కాలంలో మండలంలో 30 మంది రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, ఈ ఏడాది ఇప్పటి వరకు ఐదుగురు మృత్యువాత పడ్డారన్నారు. పట్టణంలో వ్యాపార దుకాణాల వద్ద భారీ వాహనాల నుంచి ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, సిమెంట్ బస్తాలు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే సమయంలో రోడ్డుపై వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెట్టడం వలన ట్రాఫిక్ జామ్ అవుతుందని, ఉదయం 6 నుంచి 7 గంటల లోపు లోడింగ్, అన్ లోడింగ్ చేసుకోవాలని వ్యాపారస్తులకు సూచించారు.

పరిమితికి మించి ప్రయాణం చేయరాదు

మానవపాడు: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం చేయరాదని ఎస్ఐ చంద్రకాంత్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో వాహన తనిఖీ నిర్వహించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబధంనలు పాటించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నిడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'పత్రికా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం'



శాంతినగర్‌లో నిరసన తెలుపుతున్న పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం, పోలీసుల తీరుపై విలేకరులపై వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందని జర్నలిస్టు సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మండిపడ్డారు. పత్రికా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతోందని ఆరోపించారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయడం సరైంది కాదన్నారు.

- అలంపూర్ పట్టణంలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్త చేశారు.
- గట్టు మండల కేంద్రంలో కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు గట్టు మారెన్న ఆధ్వర్యంలో విలేకరులు, నాయకులు నిరసన వ్యక్తం చేశారు.
- శాంతినగర్ అంబేడ్కర్ చౌరస్తాలో విలేకరులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.
- దరూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో ప్రజా సంఘాల పాయకులు, హమాలీ యూనియన్, తాపీ మేస్త్రీ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు.
- మల్దకల్‌లో జర్నలిస్టుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మురళీధర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, మనోహర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జర్నలిస్టులు నిరసన తెలిపారు.
- ఎర్రవల్లిలో జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

'ఆస్తుల వివరాలు ప్రకటించాలి'

అలంపూర్: న్యాయమూర్తులతో పాటు న్యాయవాదులు ప్రతి ఐదేళ్లకోసారి తమ ఆస్తులను ప్రకటించాలనే నిబంధనలు ఉండాలని అలంపూర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. న్యాయమూర్తుల అవినీతిలో న్యాయవాదుల పాత్ర కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. అందుకు ఈ మధ్య కాలంలో జరిగిన ఘటలను ఉదాహరణలుగా తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇద్దరు న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో పదవీ నుంచి తొలగించినట్లు తెలిపారు. ప్రతి వ్యవస్థలోని అవినీతిని ప్రశ్నించి అడ్డుకోవాలని కోరారు. అక్రమ ఆస్తులను కలిగిన వారిపై విచారణ చేసి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ధరూరు: మండల కేంద్రంలోని మరనాథ విస్వాస సమాజ మందిరంలో గురువారం జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిషప్ ఎం వసంత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ ప్రకాశం, జనరల్ సెక్రెటరీగా బీఆర్ బెనహర్‌రాజ్, జాయింట్ సెక్రెటరీగా విశాల్, కోశాధికారిగా నతానియేల్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు యోహాను ప్రసాదరావు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ కాపరి పాస్టర్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

గోపాల్‌పేట: చోరీ కేసులో గురువారం ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించామని గోపాల్‌పేట ప్రొహిబిషన్ ఎస్ఐ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బుద్దారం గ్రామంలో ఇటీవల ఓ ఇంట్లో చోరీ జరిగింది. గురువారం ప్రొహిబిషన్ ఎస్ఐ నరేష్ గోపాల్‌పేట మండల కేంద్రంలోని కో దండరామ స్వామి ఆలయ ప్రాంతంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్ద రు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా బుద్దారంలో బుధవారం అర్జునయ్య ఇంట్లో తామే దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. వారి నుంచి దొంగిలించిన సొమ్మును జప్తు చేసి నిందితులు బింగి శ్రీకాంత్, మండ్ల నరేష్‌ను రిమాండ్‌కు తర లించామని వివరించారు.

ధాన్యం కొనుగోలుకు రైతులు సహకరించాలి

వీపనగండ్ల: కొనుగోలు కేంద్రాల్లో రైతులు సహకరిస్తేనే వరి ధాన్యం కొనుగోలు చేయడం వేగంగా పూర్తవుతుందని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం పుల్గర్‌చర్లలో ధాన్యం విక్రయంలో రైతులు పాటించాల్సిన పలు నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. సన్నరకం ధాన్యంలో 14 శాతం, దొడ్డు రకంలో 17 శాతం తేమ ఉండాలని, వాటిని మాత్రమే కొనుగోలు చేసేందుకు వీలు అవుతుందన్నారు.